# అడవిలో అపరాధ పరిశోధన

చాలాకాలం కిందట బొబ్బర లంకలో ఒక చిట్టడవి ఉంటుండేది. అక్కడ ఉన్న జంతువులు, పక్షులు, పాములూ ఎంతో స్నేహంతో కలిసి మెలిసి ఆనందంగా కాలం గడుపుతుండేవి. పిల్లల చదువుకోసం అవి చిన్న బడిని తెరిచాయి. ఆ బడిలో వయసొచ్చిన పిల్లలంతా చదువుకుంటుండేవారు.

చిలకమ్మ మైనావతి పాఠాలు బోధించేవి. కోకిలరాణి బుల్‌బుల్ కన్యా సంగీతం చెప్పేవి. నెమలి బాయి నాట్యం నేర్పేది. అశ్వమూర్తి డ్రిల్లు చెప్పేవాడు.

ఆ బడిలో చదువుకుంటూన్న పిల్లలందరిలోనూ భల్లూకరావు, జంబుకేశం చాల తెలివైనవాళ్ళు. భల్లూకరావు బలంలో గొప్పవాడు జంబుకేశం చలాకీలో గట్టివాడు. హనుమయ్యని ఇంకో అబ్బాయి ఉన్నాడు. వాడు ఒట్టి మందమతి - బడిదొంగ!

భల్లూకరావు ఎలుగుబంటి కొడుకు. జంబుకేశం నక్కపోతు మేనల్లుడు. హనుమయ్య శిలీముఖి అనే కోతమ్మ తమ్ముడు.

వీళ్ళుకాక కొంతమంది ఆడపిల్లలు - మకరాంబ, వాయసమ్మ, గోరాబాయి, పిచికతల్లి మొదలైనవాళ్ళు - చదువుకుంటున్నారు.

భల్లూకరావు, జంబుకేశం ప్రాణస్నేహితులు. ఒక కంచాన తిని ఒక మంచాన పరున్నట్టు ఉండేవారు.

ఒక ఆదివారం ఉదయం భల్లూకరావు, జంబుకేశం ఆడుకోవటానికి గోదావరి ఒడ్డుకు వెళ్లారు. ఆ దగ్గరలోనే మకరేశ్వరి యిల్లు ఉన్నది. ఆ యింట్లోనుంచి ఏడుపులూ పెడబొబ్బలూ వాళ్లకు వినవచ్చాయి! వెంటనే ఆ స్నేహితులిద్దరూ మకరేశ్వరి యింట్లోనికి పరువెత్తారు!

అక్కడ మకరేశ్వరి తల విరబోసుకొని నెత్తి మోదుకుంటూ ఆరున్నొక్క రాగంలో ఏడుస్తున్నది. మకరయ్య వూళ్ళో లేడు.

## కుం. జానకిరామ్ పట్నాయక్

తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడని వదంతి. మకరాంబ కూడా తల్లి రాగంతో తన రాగం కలిపి గోల పెడుతున్నది!

భల్లూకరావు మకరేశ్వరి దగ్గర నిల్చొని "ఏఁవయిందత్తయ్యా? ఎందుకేడుస్తున్నావ్?" అని అడిగాడు. జంబుకేశం "ఏం పిన్నీ చిన్నాన్ననుంచి ఏదయినా ఉత్తరం వొచ్చిందా?...అతను బాగున్నారా?" అని పరామర్శించాడు.

మకరేశ్వరి ఏడుపు మరింత ఎక్కువైపోయింది. నోటినుంచి మాటరాలేదు.

భల్లూకరావు మకరాంబ తల మీద చేయివేసి "ఏమేపిల్లా ఎందుకేడుస్తున్నావ్?" అని అడిగాడు.

మకరాంబ వెక్కుతూ "అమ్మ.. ఏ...ఏడుస్తుందని నే... నేను...ఏడుస్తు...న్నా...న్నాను...బావా!" అన్నది.

జంబుకేశం తిరుగా మకరేశ్వరితో అన్నాడు—"ఏఁవిశైంది పిన్నీ?...ఇలా యేడ్చుకుంటూ కూచుంటే ఏంలాభం చెప్పు?"

మకరేశ్వరి ముక్కుచీది, చీరచెంగుతో తుడుచుకొని, జుత్తు సవరించుకుంటూ అన్నది—

"ఏం చెప్పమంటావ్ నాయనా? ఎవరో దొంగముండ వాళ్లు నా, యిల్లంతా దోచుకుపోయారు!... నా సర్వస్వం ఎత్తుకుపోయారు! మీ చిన్నాన్న యింటిపట్టున వుంటే యిలా జరిగేదా?...ఇదంతా నా ఖర్మం!"

"అదేఁవిటత్తయ్యా? మామయ్య తీర్థయాత్రలకు వెళ్లాడటకదా?" అన్నాడు భల్లూకరావు.

"తీర్థయాత్రలకేఁవిటి నా పిండాకూడు?—ఉన్న సంగతి చెప్పకుంటే సిగ్గుచేటని ఇలా ఏడవాల్సొస్తుంది!...కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది బాబూ!" అన్నది మకరేశ్వరి ఉదాసీనంగా!

"అయితే ఎక్కడ వున్నట్టు?" అన్నాడు జంబుకేశం.

"ఎక్కడా?...ఉందిగా ఆ మాయలమారి ముండ శిలీముఖి నాపాలిట దెష్టాదేవిలా? ... మీ

బడిలో చదువుతున్నాడే ఆగుంటడు హనుమయ్య ... వాడి అప్ప! ... అదిచ్చినపండ్లూ, కాయలూ, బాగా తిని, ఆ తోత్తుకు మరిగి, నన్నూ నాపిల్లనూ ఒదిలేశాడు!... పోనిలే బాబూ! అతను పోతే నా కేఁవిటి లక్ష్యాఁ? నా పిల్లను చూసుకొని కాలం గడిపేద్దాఁవని అనుకున్నాను! కాని యింతలో ఈ ఆపద చుట్టుముట్టుకుంది!" అన్నది మకరేశ్వరి.

భల్లూకరావూ, జంబుకేశం ఆ మాటలు విని, ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. కాస్త దూరం పోయి గుసగుసలాడుకొని తిరుగా మకరేశ్వరి దగ్గరకొచ్చి భల్లూకరావు యిలా అన్నాడు—

"అత్తయ్యా! నువ్వు బెంగపడకు! నేనూ, మా జంబూబావ ముల్లోకాలు వెతికి అయినా నీ ఆస్తినీ, దాన్ని దోచుకుపోయిన దొంగల్నీ పట్టుకొని నీకు ఒప్పచెపుతాం!"

జారిపోతున్న పైటను సర్దుకుంటూ మకరేశ్వరి అన్నది—

"నాయనా! మీరు చిన్నపిల్లలు! లోకజ్ఞానం లేదు. అదీగాక ఇది దొంగల్తోటి వ్యవహారం! అనవసరంగా నాకోసం మీ రెండుకు కష్టాలు కొనితెచ్చుకుంటారు?"

అందుకు జంబుకేశం గర్వంగా నిల్చొని, మీసందువ్వుతూ ఇలా అన్నాడు—

"పిన్నీ! నువ్వు భయపడకు! దొంగలు కూడా మనలాంటివాళ్లే! ఆకాశంనుంచి ఊడబొడుచుకు రాలేదు! వాళ్లేం చేస్తారు?... నేను ఎన్నో వందల డిటెక్టివు నవలలు చదివాను! గొప్పగొప్ప అపరాధాల్ని పరిశోధించే తెలివితేటలు నాదగ్గర ఉన్నది!... కాగా భల్లూకబ్బావ కలిశాడా అంటే పద్ధాలుగులోకాలూ జయించేస్తాం! మా విషయంలో నువ్వు బెంగపెట్టుకోవద్దు!... ఇప్పుడు నిన్ను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. తెలిసినంతవరకు దాచకుండా జవాబులు మాత్రం ఇవ్వు!"

"ఏఁవిటేఁవిటడుగుతావో అడుగు నాయనా! దాచకుండా నే చెబుతాను!" అన్నది మకరేశ్వరి.

"ఏమాత్రం ఆస్తి పోయింది?"

"వందతులాలబంగారం, ఏభయి తులాల వెండీ, పట్టుపంచలు పది, పట్టుచీరలు పదిహేను పోయాయి!"

"నీకింత ఆస్తి ఎలా వచ్చింది?"

"మోక్షంకోసం యీ నదిలో స్నానానికి చాలమంది మనుషులు వస్తుంటారు కదూ?...మరివాళ్లేగా మాకు ఆహారం!...సమయం కనిపెట్టి వాళ్లను చంపుకొని తింటుంటాం!...యీ ఆస్తి అంతా వాళ్ల నుంచి సంపాయించిందే!"

"దీన్నంతా ఎక్కడదాచావు?"

"అదిగో! ... ఆ కిటికీ మీద పెట్టెలో!"

"పెట్టెకు తాళం వేశావా?"

"తాళం ఎప్పుడూ వేయను!"

"ఈ యింట్లో నువ్వూ, మకరాంబా తప్ప ఇంకా ఎవరెవరు ఉన్నారు?"

"మరెవరూ లేరు"

"ఇక్కడకు రోజూ ఎవరెవరొస్తుంటారు?"

"మీ చిన్నానన్న వెళ్లిపోయిన నాటినుంచీ ఎవరూరా లేదు. అంతకు పూర్వం మాత్రం అప్పటప్పటా మా బావగార్లూ, మత్స్యకుటుంబాల వాళ్లూ వస్తూండేవాళ్ళు!"

"వాళ్లలో ఎవరిమీదనైనా నీకు అనుమానం ఉందా?"

"రామరామ!...వాళ్లలాంటి నిజాయితీపరులు యీ సప్తసముద్రాల్లో కూడా లేరంటే నమ్మ!"

"పోనీ మీకు విరోధులెవరైనా ఉన్నారా?"

"అలాంటివాళ్లూ లేరు!"

జంబుకేశం పూరుకొని ఆలోచిస్తున్నాడు. తరువాత భల్లూకరావు అన్నాడు—

"అయితే అత్తయ్యా! ఆ వస్తువులూ, బట్టలూ ఆఖరుసారిగా ఎప్పుడు చూశావ్?"

"రాత్రి పడుకోబోయినప్పుడు!"


**18 డి నెం.లో దేవి బహుమతులు రూ 55000.** రిజిస్టరు నెం॥965/54.

అన్నీ కరక్టుకు రూ 40000. మొదటి 8 నెంబరులు కరక్టుకు రూ 15000 ఒక ఎంట్రికి ప్రవేశ రుసుము రూ 1; 6 ఎంట్రీలకు రూ 5. పోస్టుచేయుటకు ఆఖరు తేదీ 29 9-56. ఫలితములు తేదీ 13 10-56. 28 నుండి 32 వరకు గల అంకెలను వాడిన అంకెను వాడకుండ మొత్తము చేసినచో 150 రావలెను.

| | | | | |
|---|---|---|---|---|
| | | | | |

కి-సొల్యూషన్ అణాలు 4. నిబంధనలు (రూల్సు) ఇదివరకు వలెనే బహుమతులు మారుచుండును ఎంట్రీలతోపాటు మణియార్డరు రశీదుపంపించవలెను. మణియార్డరు ఫారములోను, ఎంట్రీలలోను మీ పేరు చిరునామా, అంకెలు ఇంగ్లీషులో వ్రాసి పంపించవలెను.

D E V I Co.. 59, A. B. Road. Choolai. M A D R A S - 7.

16 C నెం. యొక్క ఫలితము

| | | | | |
|---|---|---|---|---|
| 20 | 18 | 19 | 21 | 22 |

అన్నీ కరకు రూ 676 లు
మొదటి 8 నెంబరు రూ 189

# ★ అడవిలో అపరాధ పరిశోధన ★

అంతలో జంబుకేశం చెవులు నిడిగించి, తోకఝూడించి అన్నాడు-

"పిన్నీ! నాకో అనుమానం వేస్తున్నది?"

"ఏమిటి నాయనా?"

ఏమీ అనుకోనంటే చెబుతాను!"

"అయ్యో తండ్రీ...ఎందుకనుకుంటాను?"

"దీంట్లో చిన్నాన్న చెయ్యి ఏమైనా ఉందేమో?"

"ఛా ఛా! అతనెందుకు చేయిస్తాడు? తన డబ్బును తనే దొంగతనం చేయిస్తాడా?......నాకు నమ్మకం లేదు!"

భల్లూకరావు ఒకసారి శరీరం దులపరించుకొని నవ్వి అన్నాడు—

"ఒరేయ్ జంబూ! నువ్వేమో మాంచి టక్కరివాణ్ణని అనుకొంటున్నావు! కాని నీ తలకాయలో ఉన్నదంతా ఒట్టి బురద అంటాను నేను!...లోకంలో ఎవరైనా తన ఆస్తినే దోపిడీ చేయించుకుంటార్రా?"

దానికి జంబుకేశం పండ్లికిలించి ఇలా అన్నాడు--"నోరుముయ్యరా భల్లూ! నీకున్నదంతా కండబలమే గాని బుద్ధిబలం లేదురా! తప్పక యీపని అతను చేయింపించిందే! లేదా స్వయానా తనైనా చేసి వుంటాడు!...అలా చూస్తూఉండు! నీకే తెలుస్తుంది!"

వాళ్ళ మాటలు విని మకరేశ్వరి కలవరించుకొని అన్నది—

"ఏమో నాయనా! ఇది కలికాలం! జంబూ అన్నది నిజమే కావొచ్చు!...ఇంతకూ ఎవరు చేసినా లేక చేయించినా మొత్తంమీద నాకొంప ముంచేశారు!"

"సరే అత్తయ్యా! నువ్వు గాభరా పడకు! నేనూ, జంబూ కలిసి యిందులో పనిచేస్తాం!...వారం రోజుల్లోగా దొంగనూ, ఆ ఆస్తినీ పట్టుకొని నీకు ఒప్పచెబుతాం!" అన్నాడు భల్లూకరావు

"అవును పిన్నీ! నీ ఆస్తి తెచ్చియిచ్చే పూచీ మాది! నువ్వు విచారించుకొని ఉండొద్దు!" అన్నాడు జంబుకేశం.

* * *

ఆ స్నేహితులిద్దరూ పరిశోధనకు పూనుకున్నారు. గదిలో ఏమయినా అడుగుజాడలు దొరుకుతవేమో అని దీక్షగా పరీక్షించారు! నగలూ బట్టలూ ఉన్న పెట్టెమీద వ్రేలిముద్ర లుంటవేమో అని చూశారు!...కాని ఏ ఒక్క గుర్తూ దొరకలేదు!...కిటికీకి యినప వూచలు లేవు! లోనుంచి వేసే గడియలుమాత్రం వూడిపోయివున్నయ్! బయటనుంచి బలవంతంగా త్రోయడంవల్ల వూడిపోయినట్టుగా ఉన్నవి.

ఇంట్లో ఎలాంటి ఆధారం దొరకనందువల్ల బయట కొచ్చి చూడనారంభించారు!

కిటికీకి దిగువ కొంచెం దూరంలో ఒక నేరేడి పండు జంబుకేశానికి దొరికింది. దాన్ని చేతిలోనికి తీసుకొని అతడు దీక్షగా చూశాడు! ఆ పండు మీద ఎవరివో దంతాల గుర్తులున్నాయి!... మీద రెండు గుర్తులూ, దిగువ రెండు గుర్తులూ జంబుకేశం స్పష్టంగా చూశాడు!

వెంటనే భల్లూకరావుకు చూపిస్తూ "ఒరేయ్ భల్లూ! దీన్ని చూశావట్రా?" అన్నాడు.

"చూస్తునే వున్నానురా!...నేరేడిపండు కాదట్రా?" అన్నాడు భల్లూకరావు!

"అవును లే! నేరేడిపండే!...కాని యిక్కడకు ఎలా వచ్చిందని?" అడిగాడు జంబుకేశం.

"ఎవరో తోవంట పోయిన వాళ్లు గంట్లుపెట్టి పారేసిఉంటారు!" అన్నాడు భల్లూకరావు నిర్లక్ష్యంగా.

జంబుకేశం గట్టిగా నవ్వి, తోకఝూడించి అన్నాడు.

"అందుకే నీకు కండబలమేగాని బుద్ధిబలం లేదని అంటుంటాను!"

"ఇందులో బుద్ధిబలం చూపడానికి ఏమిటుంది?" అని బొమలెగరవేశాడు భల్లూకరావు.

ఏముందో చెప్తాను పద! దొంగ ఆచోకీ దీని మూలంగానే దొరుకుతుంది! అలా చూస్తూ ఉండు! నేరమంతా నీనోటినుంచే రప్పిస్తాను!... పద! మన బడి కాంపౌండులో మామిడిచెట్టు దిగువ కూచొని మాటాడుదాం!"


పంచతంత్రం

బొమ్మల కథల పుస్తకం

మొదటి భాగం

(మిత్రభేదం, మిత్రలాభం)

కర్త: కీ॥ శే॥

విశ్వాత్ముల నరసింహమూర్తి

వెల: రూ. 1-8-0

ఆంధ్రగ్రంథమాల, మద్రాసు -1

ఆ యిద్దరూ అక్కడకు చేరుకున్నారు! జంబుకేశం నేరడిపండు చూపిస్తూ అన్నాడు.

"ఈ పండు ఎక్కణ్ణుంచి వచ్చిందని నీ అభిప్రాయం?"

"ఇందాకనే చెప్పానుగా ఎవరో తోవంట పోయిన వాళ్లు పారేసి ఉంటారని! అన్నాడు భల్లూకరావు.

"అది కాదోయ్ బావా!... చూడు! మకరేశ్వరి యింటి చుట్టుపట్లకాని ఈ బడి చుట్టుపట్లకానీ... ఇంకా యీ ప్రాంతాల్లోగానీ నేరేడు చెట్లు ఉన్నయా?

ముక్కు పైకెత్తి, కండ్లు మూసి భల్లూకరావు కాసేపాలోచించి "లేవు" అన్నాడు.

"పోనీ నీకు తెలిసినంత వరకూ మరెక్కడైనా ఉన్నాయా?"

"ఈ చుట్టుపట్ల ఎక్కడా లేనట్టే జ్ఞాపకం!"

"కాని ఒక దగ్గర ఉన్నాయి!"

"ఎక్కడ?"

"శిలీముఖ యింటి నమీపంలో!"

"ఆఁ! ఆఁ!...అవును! అక్కణ్ణే రెండు మూడు చెట్లు...పెద్దవి... ఉన్నాయ్!

"అయితే ఈ పండు అక్కణ్ణుంచి ఎలా వచ్చిందంటావ్?"

భల్లూకరావు తిరుగా ఆలోచనలో పడిపోయాడు. కాసేపటికి "నువ్వన్నట్టు మకరయ్య దొంగతనానికొచ్చి దీన్నికాస్త కొరికి తొందరలో పారేసి ఉంటాడు!" అన్నాడు.

జంబుకేశం నవ్వి "కాదు! మకరయ్య ఎంతమాత్రం దొంగతనానికి రాలేదు!" అన్నాడు.

"అయితే?' తల గోక్కుంటూ భల్లూకరావడిగాడు.

"ఈ పండు బాగా చూడు!... దీనిమీద పడ్డ గంట్లుచూస్తే మకరయ్య పెట్టినవాటిలా కనిపించవు!...మకరయ్య దంతాలు పెద్దవి! ఈ పండుమీది గాట్లు సన్నంగా, చిన్నవిగా ఉన్నాయ్!... కాగా మకరయ్య ఇలాంటి పండ్లను దవడ పండ్లలో పెట్టి కసాబిసా నమిలివేస్తాడు! కాని యిలా ముని పండ్లతో గంట్లుపెట్టడు!...దీన్నిబట్టిచూస్తే ఈ వ్యవహారంలో మకరయ్య లేనట్టు రూపించిపోతున్నది కదా?"

"అవునవును!...బహుశా శిలీముఖ వచ్చిందేమో?"

"లేదు!...అదీ రాలేదు!...నువ్వు మర్చిపోయావేమోగాని నాకు మాత్రం జ్ఞాపకం ఉంది! శిలీముఖ ముందరిపండ్లలో ఒకటి ఊడిపోయింది! అదేగాని యీ పండును కొరికివుంటే ఈ మాదిరి నాలుగు గంట్లుపడవు!... తెల్సిందా?"

(మిగిలినది పైవారం)


గెలవండి **32,000** గెలవండి

రిజిష్టర్డు నెం 1257 — పోటీ నెం V-4

మా సీల్డు అఫిషియల్ కీ సొల్యూషన్ ప్రీమియర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు వారివద్ద ఉన్నది. వారి అధికారముతో అది ప్రకటించబడును. ప్రథమ బహుమతి ఆల్ కరెక్టు రు. 16,000. రెండవ బహుమతి, మొదటి రెండు లైనులు కరెక్టు రు 8,000 మూడవ బహుమతి మొదటి ఒక లైన్ కరెక్టు రు. 4,000. నాలుగవ బహుమతి మొదటి రెండు నెంబర్లు కరెక్టు రు. 3000. (మా కీ సొల్యూషన్ ప్రకారం నిలువుగా, అడ్డంగా వుండవలెను.) ఎక్కువ ఎంట్రీలు. పంపినవారికి రు. 1000 ప్రత్యేక బహుమానము. ఆల్ కరెక్టుగా పంపినవారికి డైనమోలైటుతో కూడిన ఒక రడ్జి సైకిలు ప్రత్యేక అదనపుబహుమానము. Key S. No.V-3

66 (పూర్తిగా రైటు పంపినవారు ఒక్కరికన్న యెక్కువగా నున్నచో బహుమానపు విలువ సమానముగ పంచబడును.

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

68

| | | | |
|---|---|---|---|
| 13 | 20 | 17 | 8 |
| 18 | 7 | 14 | 19 |
| 12 | 21 | 16 | 9 |
| 15 | 10 | 11 | 22 |

**ఆఖరు తేది 18-9-56** **ఫలితములు 22-9-56**

ప్రవేశ రుసుము: ఒక ఎంట్రీకి రు. 1/-; 4 ఎంట్రీలకు రు 3/-; 16 ఎంట్రీలకు రు. 10/- 50 ఎంట్రీలకు రు. 26/-; 100 ఎంట్రీలకు రు 40/.

సాల్వు చేయవలసిన విధానము:-ఈ చదరములో 9 నుండి 24 వరకు గల అంకెలు నిలువుగా అయిమూలగా అడ్డముగా ఎటు కూడినా 66 వచ్చేట్లు వేయాలి ఒక అంకె ఒకమారే వాడాలి. సాదా కాగితముమీద ఎన్ని ఎంట్రీలైనా పంపవచ్చును. ప్రతి ఎంట్రీకింద, పంపేవారి పేరు అడ్రసు అంకెలు స్పష్టంగా పెద్ద అక్షరాలతో ఇంగ్లీషులో వ్రాయాలి. సొమ్ము ఇండియన్ పోస్టల్ ఆర్డర్లుగా, లేక మనియార్డర్లుగా పంపాలి. మనియార్డరు రశీదులు యెంట్రీల వెంట పంపవలెను. ప్రతి మనియార్డరు ఫారమునకు జతపరుచు కూపనులో సొమ్ము పంపువారు తన పేరు, అడ్రసు ఇంగ్లీషులో వ్రాయవలెను. విదేశములవారు ఎంట్రీ సొమ్మును బ్రిటిషు పోస్టల్ ఆర్డరుద్వారా పంపించవలెను "వసూలును బట్టే బహుమతుల సొమ్ము మారుచుండును."

మేనేజరు తీర్మానము ఆఖరు, చట్టబద్ధమైనది. 0-4-0 స్టాంపులు. పంపినచో పోస్టులో ఫలితముల లిస్టుపంపబడును మా ప్రత్యేకరూల్సు, షరతులు బాగా తెలిసినవారే పోటీలో పాల్గొనాలి.

**Vijaya Competitions, (25), Sunkurama Chetty Street, Madras-1.**

# అడవిలో అపరాధ పరిశోధన

(గత సంచిక తరువాయి)

భల్లూకరావు ఒక కుప్పిగంతు వేసి ఆనందంతో "అవునవును! ఎంత జ్ఞాపకం ఉందోయ్ బావా నీకు?...కాగా ఎంత చక్కగా ఆ చోకీ తీస్తున్నావ్?"...అదీ ఎక్కడకూ వెళ్ళకుండా!" అన్నాడు.

జంబుకేశం ఉప్పొంగిపోయి "మరేమిటనుకున్నావ్ బుద్ధిబలమంటే?...ఇంతకూ యీ పనంతా ఆ గుంటవెధవ హనుమంతయ్యదే! వాడికి మకరయ్య, శిలీముఖి నేర్పి పంపించి ఉంటారు! తినడానికి తెచ్చుకున్న పండ్లలో ఒకదాన్ని యిలా వాడు కొరికి పారేసిఉంటాడు!" అన్నాడు.

"నిజంగా అలానే జరిగిఉంటుంది! కాని యీ పండు గనర్రాత్రే వేసి ఉంటాడని దాఖలా ఏమిటి?" అని భల్లూకరావు అనుమానం వెలిబుచ్చాడు!

జంబుకేశం నవ్వి అన్నాడు—

"నువ్వీ ప్రశ్న వేస్తావనుకున్నాను!...చూడు! ఈ పండు నిన్న సాయంత్రమే తీసి ఉండకపోతే యింత తాజాగా ఉండదు!..."

"సరి సరి!...యిప్పుడంతా ఋజువైపోయింది!...మనం యీ క్షణమే వెళ్ళి హనుమయ్యను నాలుగు తగలనిచ్చామంటే గుట్టు బయటపడుతుంది!"

"ఆ తొందరే వద్దన్నాను!... ఇంకా కొంత ఆ చోకీతీసి అప్పుడు పట్టుకున్నామంటే బావుంటుంది!"

"ఇంకేం ఆ చోకీ తీయాల్సి ఉంటుంది?"

"సాయంత్రం చీకటిపడ్డాక మనయిద్దరం శిలీముఖి ఇంటికి వెళ్ళాలి! అక్కడ వాళ్ళు ఆడుకొనే మాటల్లో మనకు పనికివచ్చేవి ఏమైనా ఉంటవేమో చూడాలి! తరవాత కార్యక్రమం ఆలోచించాలి!"

* * *

ఆ సాయంత్రం చీకటిపడ్డ తరువాత జంబుకేశం, భల్లూకరావు శిలీముఖి యింటికి చేరుకున్నారు!

గోదావరి ఒడ్డున ఉన్న పెద్ద మర్రిచెట్టుమీద శిలీముఖి యిల్లు కట్టుకొని ఉన్నది. చాల రోజుల వరకు ఆమె, ఆమె తమ్ముడు హనుమయ్య ఆ యిద్దరే ఆ యింట్లో వుంటుండేవారు ఇప్పుడు మకరయ్యతో స్నేహం కలిసినప్పటి నుంచీ, ఆ ముగ్గురూ రాత్రి పూట చెట్టు మొదట్లో గుహలాంటి పెద్ద తొఱ్ఱలో ఉంటున్నారు.

జంబుకేశం, భల్లూకరావు ఊడల్లోనుంచి, మెల్లిగా తొఱ్ఱ దగ్గరకు చేరుకున్నారు. లోనించి మెల్లిగా యిలా వినవచ్చింది.

"అక్కా! నాకో ఉంగరం యివ్వవూ?" హనుమయ్య అన్నాడు.

"ఇప్పుడు కాదురా...కొన్నాళ్లు పోనీ!" శిలీముఖి జవాబిచ్చింది.

"ఊఁహుఁ...నాకిప్పుడే కావాలి!" అంటూ మారాం పెట్టాడు హనుమయ్య.

"ఇప్పుడొద్దురా వెధవా!...అది కాని పెట్టుకొని బడికి వెళ్ళావంటే కొంప మునిగిపోతుంది!" అని శిలీముఖి గద్దించింది!

"పోనిద్దూ శిలీ! గుంట వెధవ సర్దాపడుతున్నాడు! ఒకటి వాడి ముఖాన పారేస్తే సరి! అన్నాడు మకరయ్య.

"మీకేం మతిపోయిందా ఏమిటి?...అవి తెచ్చి యింకా ఇరవై నాలుగు గంటలైనా కాలేదు... అప్పుడే బయటపెట్టి వేస్తే ఏమవుతుందో తెలీదా?" అన్నది శిలీముఖి రూక్షంగా.

"లేదక్కా! నేను దాన్ని పెట్టుకొని బడికి వెళ్ళనే! ఇంటిదగ్గరే పెట్టుకుంటాను!" గునుస్తూ హనుమయ్య అన్నాడు

"నోరుమూసుకు పూరుకుంటావా...తోకపట్టుకొని ఏట్లోనికి విసిరేయమన్నావా వెధవా?" అని శిలీముఖి గద్దించింది.

హనుమయ్య కిక్కురుమనకుండా పూరుకున్నాడు. తరువాత వాళ్ళ మాటలు వినిపించలేదు!

విన్నమట్టుకు చాలుననుకొని జంబుకేశం, భల్లూకరావులు ఆనందంతో గంతులువేసుకుంటూ ఇండ్లకుపోయారు

మర్నాటి ఉదయాన ఆయిద్దరూ మకరేశ్వరి యింటికి వెళ్ళి, తాము సేకరించిన విషయాలు విస్తరించారు. మకరేశ్వరి తన ఆస్తి అప్పుడే దొరికి పోయినట్టు ఆనందించింది!

"నాయనా జంబూ! నువ్వెలాగైనా తెలివైనవాడివి! నువ్వూ, మీ బావ భల్లూ చేసిన ఉపకారానికి నేను ఎల్లకాలం కృతజ్ఞతతో వుంటాను. మిగిలిన ఆ కొరదాది కూడ పూర్తి చేశారంటే మహా పుణ్యం ఉంటుంది!" అన్నది మకరేశ్వరి.

ఈమాత్రానికేమిటి పిన్నీ!... కష్టాలందరికీ వస్తాయి!...ఇవ్వాళ నీకొచ్చింది. రేపు మాకొస్తుంది!... అయినా ఆ శిలీముఖి...ఆ హనుమయ్యా ఇంత అఘాయిత్యానికి ఒడిగట్టకుంటారని అనుకోలేదు!" అన్నాడు జంబుకేశం!

"వెధవలు వేలెడంతేసి లేరు... కాని కొంపవూడదీసేశారు. అయినా యిల్లు అలకగానే పండుగైపోలేదు!.. వీళ్ళను ఒక్కొక్కరినీ, ఒక్కొక్క గుద్దుతో "హరీ" మనిపించకపోతే నా పేరు భల్లూకరావు కాదు! మాది జాంబవంతుడు వంశం!... ఏమనుకున్నారో చచ్చు దద్దమ్మలు!" అన్నాడు భల్లూకరావు ఛాతీ విర్చుకుంటూ.

"బావా!...ఒకరినంటే ఏం లాభం?...మీ మావయ్య సలహామీదనే యిదంతా జరిగింది!...లేకపోతే యింతకాలం లేనిది యిప్పుడెందుకిలా అవుతుంది?" అన్నది మకరేశ్వరి

జంబుకేశం కాస్త ఆలోచించి తొందరపడితే లాభంలేదు బావా! కాస్త నిదానంమీద పని చేస్తే పిన్ని ఆస్తి దొరికిపోతుంది...పైగా చిన్నాన్నను కూడా ఆ ముండ పట్టునుంచి తప్పించడమవుతుంది!... లేదూ అంటే ఆ అక్కా-తమ్ముడూ పరారీ అయిపోతారు! పోయిన ఆస్తి మరి దొరకదు!" అన్నాడు.

"ఏదో బాబుల్లారా! అంతా సవ్యంగా నడిచిపోయేలానూ, మన ఆస్తీ, మన మనిషీ మన యింటికి చేరిపోయేలానూ మీకూ ఏ కష్టమూ నష్టమూ కలగకుండా వుండేలానూ, చూడండి!" అన్నది

మకరేశ్వరి గట్టిగా నిట్టూర్చి!

'పరవాలేదు పిన్నీ! ఎవరికీ ఏ యిబ్బందీలేకుండానే అంతా చక్కగా ఫలించేటట్లు చేయడమవుతుంది! నువ్వుమాత్రం బెంగ పెట్టుకోకుండా ఉండు! రేపీపాటివేళకు చిన్నాన్నా, ఆస్తి యింట్లో పడేట్టు చేస్తాం!" అన్నాడు జంబుకేశం.

ఆ మధ్యాహ్నం వాళ్ళిద్దరూ అడవిలోనికివెళ్ళి ముందు కార్యక్రమం గురించి ఆలోచించారు! కొంత తర్జనభర్జనలైనతరువాత జంబుకేశం యిలా అన్నాడు—

"మన కీపనిలో కొండచిలువ కొడుకు అజగరరావూ, ఏనుగు తమ్ముడు, దీర్ఘదంతుడూ సాయపడాల్సి ఉంటుంది...రాత్రి ఎనిమిది కానిది శిలీముఖి, హనుమయ్యా చెట్టు దిగువ తొఱ్ఱల్లోనికి రారు! అంతవరకూ చెట్టుమీది యింట్లో వుంటారు మకరయ్యకూడ నది నుంచి అప్పుడే వస్తాడు...మనం చేసుకోవాల్సిన ఏర్పాట్లన్నీ అంతకు ముందే చేసుకోవాలి!"

"బావుంది కాని-అజగరరావూ, దీర్ఘదంతుడూ మనకు సాయపడతారా?" అన్నాడు భల్లూకరావు అనుమానంతో.

"తప్పక సాయపడతారు!... ఒకప్పుడు సాయపడకపోతే మరొకరి కాళ్ళు పట్టుకుందాం!...ఎప్పుడైనా సమయంవస్తే మనమూ వాళ్ళకు సాయపడం!...వాళ్ళు ఎంత గొప్పవాళ్ళయితే ఏం?... కిందటిసారి చూడవూ మహారాజగారైన కేసరివర్మ వలలో పడిపోతే, వేలెడంత చుంచూబాయి ఎలా సాయపడి ప్రాణాలు కాపాడిందో?" అన్నాడు జంబుకేశం!

వెంటనే ఆ యిద్దరూ బయలుదేరి అజగరరావు, దీర్ఘదంతుల దగ్గరకు వెళ్ళారు. జరిగిన వృత్తాంతం చెప్పి, వాళ్ల సాయం కోరారు! అజగరరావు, దీర్ఘదంతులు పరమ హర్షంతో సాయంచెయడానికి ఒప్పుకున్నారు.

తరువాత, ఆ రాత్రి ఆ నలుగురూ ఎవరెలా ప్రవర్తించాలో, చక్కగా కూడబలుక్కున్నారు!

సాయంత్రమైంది! చీకట్లు నాల్గు మూలలా కమ్ముతున్నాయి.

అజగరరావు మెల్ల మెల్లగా ప్రాక్కుంటూ, మఱ్ఱితొఱ్ఱలో దూరి, మండిగం వేసుకొని కూచున్నాడు! దీర్ఘదంతుడు ఒక వెదురుపొద చాటున పొంచిఉన్నాడు! జంబుకేశం, భల్లూకరావు ఊడలమధ్య దాక్కొని అంతా గమనిస్తున్నారు!

రాత్రి ఎనిమిదైంది. శిలీముఖీ, హనుమయ్యా అరటిపండ్లూ, పనస తొనలూ, కొబ్బరి ముక్కలూ, సపోటాపండ్లూ బాగా మెక్కి, పుట్ట తేనె తాగి, కొన్ని పండ్లూ, కొంత తేనె మకరయ్యకోసం పట్టుకొని, చెట్టుదిగి, తొఱ్ఱలోనికి వెళ్ళారు!

# ★ అడవిలో అపరాధ పరిశోధన ★

ముందుగా హనుమయ్య ఉన్నాడేమో, తొర్రలో దిగి దిగటంతో ఏదో మెత్తగా అతని పాదాలకు తగిలింది!

"అక్కా!...ఏమిటో దిగువ... మెత్తగా ఉందే" అన్నాడు భయంతో.

"ఏమిట్రా పిచ్చిగోల పిరికి వెధవా?" అంటూ శిలీముఖి దిగింది.

వెంటనే అజగరరావు ఉవ్వెత్తున లేచి, ఆ అక్కా తమ్ముళ్ళను తన పొడవాటి శరీరంతో చుట్టివేశాడు!

అదేసమయంలో, మకరయ్య నదినుంచి ఒడ్డుకువచ్చి, వెనుకపాద సమీపించేసరికి, దీర్ఘదంతుడు అతణ్ణి తొండంతో చుట్టబెట్టి మీదికెత్తాడు!

అక్కడ తొర్రనుంచి శిలీముఖి హనుమయ్యల ఏడ్పులూ, ఇక్కడ మకరయ్య పెడబొబ్బలూ, ఆ అడవి అంతా ప్రతిధ్వనించిపోయాయి!

ఆ గందరగోళం విని, జంబుకేశం, భల్లూకరావులు తమ పాచిక పారిందని ఆనందిస్తూ ఒక్క ఉదుటున మర్రిచెట్టు దగ్గరకు వచ్చారు!

దీర్ఘదంతుడు మకరయ్యను దిగువకు దించి, ముందరిపాదం అతని వీపుమీద మోపి, అదిమిపట్టి నిల్చున్నాడు! తరువాత అజగరరావు, శిలీముఖి హనుమయ్యలను బంధించి తెచ్చాడు!

ఆపైని విచారణ జరిగింది. మొదటిలో శిలీముఖి, హనుమయ్యా తమకేమీ తెలియదని వంద ప్రమాణాలు చేశారు. కావలిస్తే యిల్లు సోదా చేసుకోమన్నారు!

అప్పుడు జంబుకేశం తొర్రలోనూ, భల్లూకరావు చెట్టుమీది యింటిలోనూ గాలించి వెదికారు. ఎక్కడా ఏమీ కనిపించలేదు. 'ఇది కాదురా' అని ఆ నలుగురూ నాలుగు రకాలుగా ఆ అక్కా తమ్ముళ్ళ వీపులు విమానం మోత మోయించారు! దానితో ఒళ్ళు దులుపుకుంటూ వాళ్ళు నిజాన్ని బయటపెట్టారు!

ఆ బంగారం, వెండీ, పట్టుబట్టలూ కలిపి మూటకట్టి, ఆ చెట్టుకొమ్మల మధ్య ఉన్న చిన్న తొర్రలో ఉంచినట్టు చెప్పారు.

వెంటనే భల్లూకరావు చెట్టు ఎక్కి, ఆ తొర్రనుంచి ఆ మూటను పట్టుకొచ్చాడు!

జంబుకేశం ఒక్క పరుగున వెళ్ళి మకరేశ్వరినీ, మకరాంబనూ పిలుచుకొచ్చాడు!

వాళ్ళ ఆస్తి దమ్మిడీల్తోసహా జంబుకేశం భల్లూకరావులు మకరాంబకు ఒప్పజెప్పారు! శిలీముఖినీ, హనుమయ్యనూ ఆ అడవినుంచి తరిమివేసి, తిరుగా వాళ్ళు ఏనాడైనా ఆ అడవిలో కనిపిస్తే ప్రాణాలు తీసివేస్తామని ఆజ్ఞాపించారు! మకరయ్యను తలో చివాటూ పెట్టి, ఇకమీద అలాంటి పాడుపనులు చేయవద్దని బుద్ధిచెప్పారు!

మర్నాడు మకరేశ్వరి పెద్ద విందు చేసి, తనకు సాయపడ్డ జంబుకేశానికీ, భల్లూకరావుకూ బంగారం కడియాలూ, పట్టుపంచలూ యిచ్చి గౌరవించింది! అజగరరావుకు, దీర్ఘదంతునకు బంగారం ఉంగరాలు బహూకరించింది!

విందుకొచ్చిన పెద్దలంతా జంబుకేశానికీ భల్లూకరావుకూ "అడవిలోని అపరాధ పరిశోధకులు" అన్న బిరుదాన్ని యిచ్చారు!

తరువాత కొంత కాలానికి భల్లూకరావుకూ మకరాంబకూ గొప్పగా వివాహం జరిగినట్టు పత్రికల్లో పడింది! ★

